క్లుప్తంగా

వికసించిన బ్రహ్మకమలం



నర్సంపేట : నర్సంపేట పట్టణంలో అరుదైన బ్రహ్మకమలం వికసించింది. ప్రముఖ కవి, రచయిత, లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకుడు కాసుల రవి కుమార్ లైబ్రరీ ఎదుట ఐదేళ్ల క్రితం నాటిన మొక్క గురువారం రాత్రి పూసి వికసించగా స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. పువ్వు అరుదుగా కనిపించడంతో శుభసూచకంగా భావిస్తారు. ప్రత్యేకంగా రాత్రివేళ మాత్రమే కనిపించే ఈ పువ్వు ప్రజలను ఆకర్షించింది. పలువురు కెమెరాల్లో బంధించారు.

పొలం బాట



రాయపర్తి : విద్యుత్ శాఖ అధికారులు మండలంలోని కొండూరులో పొలం బాట కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎస్ఎస్35 యొక్క డీటీఆర్‌లో ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా డీఈటీ ఇన్‌చార్జ్ డీఈ ఆనందం, వర్ధన్నపేట ఏడీఈ నటరాజ్ మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని రైతులకు చెప్పారు. సమస్యలు తలెత్తితే విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ రవళి, ఎస్ఎల్ఐ రాజయ్య, ఏఎల్ఎం రవీందర్, ప్రభాకర్, రవి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



దుగ్గొండి : మండలంలోని బల్వంతాపురం గ్రామానికి చెందిన నామాల అమరేశ్వర్ గత నెలలో సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా టవర్ పాయింట్ ఆధారంగా పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా సదరు ఫోన్‌ను అమరేశ్వర్‌కు ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి గురువారం రాత్రి అందజేశారు.

మర్చిపోయిన స్మార్ట్ ఫోన్..



నర్సంపేట : ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన స్మార్ట్ ఫోన్‌ను కండక్టర్ బాధితురాలికి అప్పగించారు. వివరాలిలా.. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం నిజామాబాద్ వెళ్లి తిరిగి నర్సంపేటకు వస్తున్న క్రమంలో మెట్‌పల్లి నుంచి కోరుట్లకు ప్రయాణించిన ఓ మహిళ స్మార్ట్ ఫోన్ సీటులోనే మర్చిపోవడాన్ని కండక్టర్ గొలనకొండ వేణు గమనించారు. వెంటనే డీఎం ప్రసూనలక్ష్మికి సమాచారం అందించారు. అంతలో సెల్‌ఫోన్ మర్చిపోయిన ప్రయాణికురాలు ఫోన్ చేయడంతో మాట్లాడి ఆమెను మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన రామగిరి రమ్యగా టికెట్, ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి డ్రైవర్ స్వామితో కలిసి ఫోన్ అందించారు.

వైద్యశిబిరం

పర్వతగిరి : మండలంలోని ఇస్లావత్‌తండాలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మమత పలువురికి షుగర్, బీపీ, తదితర పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ లెవల్స్ బాధితులకు మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్యంతో బాధపడుతుంటే స్థానిక పీహెచ్‌సీలో వైద్యం చేయించుకోవాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు మూడు మంజుల, పూల, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విహార యాత్ర



నర్సంపేట : నర్సంపేట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో దివ్యాంగుల కోసం గురువారం ప్రత్యేక విహార యాత్ర నిర్వహించారు. టూర్ ప్యాకేజీలో భాగంగా నర్సంపేట డివిజన్ పరిధిలోని దివ్యాంగులతో కుటుంబాలతో సహా మల్లూరు హేమాచల లక్ష్మీనృసింహస్వామి ఆలయం, వాజేడు బొగత జలపాతం, మేడారం సమ్మక్క –సారలమ్మ గద్దెలు, లక్నవరం సందర్శింపజేసి రాత్రికి నర్సంపేటకు తీసుకొచ్చారు. భోజన సదుపాయంతోపాటు విహార యాత్ర తీసుకెళ్లడం పట్ల దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు.

‘ఉపాధి’ వేతనాలు అందక వెతలు

● నాలుగు నెలలుగా పెండింగ్

నల్లబెల్లి : వలసలను నివారిస్తూ గ్రామీణ పేదలకు ఆదాయం కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఆయా ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటారు. పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రారంభంలో కూలీలకు చాలా మేలు కలిగింది. కాలక్రమంలో మార్పులు చేశారు. కాగా వేతనాలు సకాలంలో కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో చేపల చెరువు కుంటలు, పంట, వరద కాల్వల, నీటి నిల్వ గుంతల, పండ్ల తోటల పెంకం, తదితర పనులు చేపట్టారు. మండల పరిధిలో 3553 మందికి జాబ్ కార్డులు ఉండగా అందులో 5314 మంది కూలీలు పని చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మండల పరిధిలో కూలీలకు నెలకు సుమారు రూ.90 లక్షలకుపైగా వేతనం చెల్లించాల్సి ఉంది.

నాలుగు నెలలుగా ఎదురుచూపు

ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలు పని చేసిన 21 రోజుల్లోనే వేతనాలు చెల్లించాలి. చేపల చెరువు కుంటలు, పంట, వరద కాల్వల, నీటి నిల్వ గుంతల, పండ్ల తోటల పెంపకం, తదితర పనులు చేసినా సకాలంలో వేతనాలు అందడం లేదు. పనికి వెళ్లిన కూలీలకు నాలుగు నెలలు గడుస్తున్నా వేతనాలు మంజూరు కాలేదు. దీంతో కూలీలు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనాల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుండగా త్వరలో అందుతాయంటూ అధికారులు దాటవేస్తున్నట్టు విమర్శలున్నాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బకాయిలు చెల్లించాలని ప్రజలు కోరుతున్నారు.



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు (ఫైల్)

ఎండాకాలంలో పని చేశా..



ఎండాకాలంలో ఉపాధి హామీ పథకంలో నాలుగు వారాలు పని చేశా. కూలి ఎప్పటికప్పుడే అందుతుందంటే పనికి వెళ్లాం. పనులు చేసిన నాలుగు నెలలు గడచినా నేటికీ బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. అధికారులను అడిగితే దాటవేస్తున్నారు. వెంటనే చెల్లించాలి.

– ఉడుత రాజన్న, కూలీ

త్వరలో వేతనాలు చెల్లిస్తాం



కూలీలకు వేతనాలు అందించడంలో జాప్యం జరుగుతోంది. పని చేసిన కూలీల వేతనాలకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాము. మా పరిధిలో పెండింగ్ ఏమీ లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కూలీ లకు వేతనాలు సకాలంలో అందేలా కృషి చేస్తాం.

– పసరగొండ రవి, ఎంపీడీఓ

ఆవాస్ సర్వే పూర్తి చేయండి

పర్వతగిరి : పీఎం ఆవాస్ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగిన పూర్తి చేయాలని ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ కోరారు. మండలంలోని హట్యతండాలో జరుగుతున్న పీఎం ఆవాస్ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బేస్‌మెంట్ లెవెల్ ఉన్న ఇళ్లను లెంటల్ లెవల్ వరకు, లెంటల్ లెవల్‌లో ఉన్న ఇళ్ల ఆర్‌సీసీ పనులు, ఆర్‌సీసీ పూర్తయిన ఇళ్ల నిర్మాణాలను సంపూర్ణంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

పర్వతగిరి : కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అత్తి కుమారస్వామి తెలిపారు. మండలంలోని వడ్లకొండలో అలుగునూరి భాగమ్మ చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని గురువారం కుమారస్వామి ప్రారంభించి మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని చెప్పారు. దశలవారీగా బిల్లులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాల్లె రాజు, నాయకులు రమేశ్, పంతంగి వెంకన్న, కోదాటి గోపాలరావు, అలుగునూరి ఎల్లయ్య, చింతకాయల రమేశ్, వడ్డే కుమారస్వామి, అలుగునూరి రాజు, రాంబాబు, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ వల్లందాస్ చిన్ని రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న కుమారస్వామి

10 మందిపై కేసు నమోదు

నర్సంపేట రూరల్ : పరస్పర ఫిర్యాదులతో 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. నర్సంపేట వల్లభ్‌నగర్‌కు చెందిన కొంగ మురళి సోదరుడి ఇంటి భాగాన్ని ఓర్సు తిరుపతి భార్య పేరిట కొనుగోలు చేశాడు. కొంగ మురళితో పాటు అతని కుమారులు వినోద్, సాయి కుమార్, నాగలక్ష్మిలను ఓర్సు తిరుపతి, ఓర్సు సుధాకర్, ఓర్సు రాజు, ఓర్సు రమేశ్, ఓర్సు రాజు గాయపర్చారని మురళి ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి మురళి తన ఇంటికి వచ్చి తలుపు కొడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ తిరుపతి ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదులతో ఓర్సు తిరుపతి, ఓర్సు సుధాకర్, ఓర్సు రాజు, ఓర్సు రమేశ్, ఓర్సు రాజు, మురళి, నాగలక్ష్మి, సాయికుమార్, రాజు, రేష్మలపై కేసు నమోదు చేశారు.

బాలుడి మిస్సింగ్ కేసు ..



స్వరజిత్ హల్దీర్ (ఫైల్)

గీసుకొండ : మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)లో పని చేయడానికి వచ్చిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన స్వరజిత్ హల్దీర్ అనే బాలుడు కనిపించడం లేదంటూ అతడి బంధువులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జూన్ 29న ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడని, పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. బాలుడి బంధువుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మహేందర్ తెలిపారు. బాలుడు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సీఐ కోరారు.

అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లబెల్లి : కళ, సాహిత్యం, సాంస్కృతికం, పర్యావరణం, జానపదం, తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారి నుంచి శ్రీరాముల శ్రీనివాస్ మెమోరియల్ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని నారక్కపేటకు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ ఎస్సైగా ప్రజలకు ఎనలేని సేవలు అందించగా ఆయన స్మారకార్థం వివిధ రంగాల్లో సేవలు అందించిన కళాకారులను ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. ఎంపికైన వారికి రూ.10,016 నగదు పారితోషికం, మెమెంటో అందించి సత్కరిస్తామని చెప్పారు. అర్హులు ప్రెస్ క్లిపింగ్స్, ఫొటోలు, రెండు ఎన్వలప్స్ కవర్లు జత చేసి అక్టోబర్ 26వ తేదీలోపు ఇంటి నంబర్:1–83, గ్రామం రంగాపురం, మండలం నల్లబెల్లి, జిల్లా వరంగల్ –506350కు రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు పంపించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ 9959494937లో సంప్రదించాలని కోరారు.

కార్యవర్గం నియామకం

దుగ్గొండి: బీసీ సంక్షేమ సంఘం మండల కార్యవర్గాన్ని మండలంలోని గిర్నిబావిలో గురువారం నియమించారు. అధ్యక్షుడిగా పొన్నాల మహిపాల్, ఉపాధ్యక్షులుగా చొప్పరి భాస్కర్, కొత్తపల్లి శివ, కార్యదర్శిగా మోకిడె శ్రీకాంత్, యూత్ కమిటీ అధ్యక్షుడిగా బోళ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్, శివాజీ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ సెల్ కమిటీ..

వర్ధన్నపేట : మండలంలోని రామవరంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ కమిటీని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య నియమించారు. అధ్యక్షుడిగా చిలుముల రాజు, ప్రధాన కార్యదర్శిగా చిదుముల వెంకటస్వామి, కోశాధికారిగా చెరిపెల్లి సోమయ్య, కార్యదర్శిగా చెరిపెల్లి మహేంద్రను నియమించారు. అనంతరం సమ్మయ్య మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, జిల్లా అధ్యక్షులు తూళ్ల రవి ఆదేశాల మేరకు కమిటీ నియామకం చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్ర ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

నర్సంపేట : పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లోని సర్వే నంబర్ 111లోని భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు కోరారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం బాబు మాట్లాడుతూ సదరు భూమిని రియల్టర్లు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని చెప్పారు.

వనభోజనాలు



దుగ్గొండి : ఈసారి సద్దులు, దసరా పండుగ అమవాస్య కీడులో వచ్చాయని వదంతులు వ్యాపించడంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు గురువారం వనభోజనాలకు వెళ్లారు. తెల్లవారుజామునే ఇళ్ల ఎదుట కల్లాపి చల్లి ఊరి చివర వనభోజనాలకు బయల్దేరారు. కోళ్లు బలి ఇచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించారు.

క్రీడల్లోనూ రాణించాలి

వర్ధన్నపేట : విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోను రాణించాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య కోరారు. మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో వర్ధన్నపేట జోనల్ స్థాయి క్రీడాపోటీలను గురువారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని చెప్పారు. ఆటల్లో ఆసక్తి పెంచుకుని రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాంపెల్లి యాదగిరి, ఉప్పరపెల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు దాడి రాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి అండర్–14 బాలుర, అండర్–17 బాలికల విభాగాల్లో ప్రతిభ చాటి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ జ్యోతి గురువారం అభినందించారు. అనంతరం మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్వహించిన చెన్నారావుపేట, నెక్కొండ ఎస్‌జీఎఫ్ఐ జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలో వైశాలి, రాజేశ్వరి, ఆశ్రిత, ఖోఖో విభాగంలో స్వాతి, ఉష, వాలీబాల్ విభాగంలో మౌనిక, కబడ్డీలో జ్ఞానేశ్వర్, వాలీబాల్‌లో గణేశ్, జీవన్, ఖోఖో విభాగంలో చరణ్, గణేశ్, జీవన్, అండర్–14 విభాగంలో ఖోఖోలో సిద్దు, విష్ణువర్ధన్, బాలికల విభాగంలో రవిత్రయని, కబడ్డీలో మేఘన, అండర్–14 బాయ్స్ కబడ్డీలో సిద్దు, విష్ణు ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు.

హిందీ నేర్చుకోవాలి




ఖానాపురం : విద్యార్థులు హిందీ నేర్చుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) శ్రీధర్ సుమన్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన హిందీ పక్వాడా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. హిందీకి భారతదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రాచుర్యం ఉందన్నారు. పిల్లలకు సాంప్రదాయ భాషగా హిందీ నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం, అధ్యాపకులు కేశవ్, విజయ్, పరాచికపు సదానందం, రాజేశ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన తాటికొండ నాగభూషణం గుండెపోటుతో మృతి చెందగా అతడి అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి స్థానికుడైన రిటైర్డ్ స్టేట్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ, ఎన్ఆర్ఐ డాక్టర్ పసునూటి కల్యాణ్ రూ.5 వేలు చొప్పున సాయం అందజేశారు. తొలుత నాగభూషణం మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి కొమురారెడ్డి, గ్రామ పెద్దలు సుదర్శన్‌రెడ్డి, సంజీవరెడ్డి, కామని రమేశ్, జాకీర్ హుస్సేన్, గురుమూర్తి, నర్సయ్య, కర్ణకంటి రామ్మూర్తి తదితరులు పరామర్శించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



నల్లబెల్లి : మండలంలోని నందిగామ, రేలకుంట గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్ నేతృత్వంలో అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సుమారు 45 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, 1900 లీటర్ల చెక్కర పానకాన్ని ధ్వంసం చేశారు. ఆరుగురిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు నరేశ్‌రెడ్డి, రమేశ్ చందర్, నాగయ్య, ఎస్సైలు రమ, శిరీష, ఎస్సై గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

● ఎస్సై ముత్యం రాజేందర్

రాయపర్తి : విద్యార్థులు సైబర్ మోసాలు, అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్, కళాశాలలో పోలీసు జాగృతి కళాబృందం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీ టీమ్స్ సేవలు, ఈవ్ టీజింగ్, బాల్యవివాహాలు, హ్యూమన్ ట్రాఫికింగ్, తదితరాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ మోసాల బారిన పడితే సత్వరమే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, వైస్ ప్రిన్సిపాల్ లీల, జాగృతి బృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ముత్యం రాజేందర్

పత్తిలో తెగులు నివారణ కీలకం

● కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ విజయభాస్కర్

వర్ధన్నపేట : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తి పంటలో వడలు తెగులు నివారణ కీలకమని వ్యవసాయ శాఖ సీనియర్ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని కట్ర్యాల, ఇల్లంద గ్రామాల్లోని పత్తి, వరి పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడారు. పత్తి పంటలో వడలు తెగులు నివారణకు నీటిలో 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. అలాగే రసం పీల్చే పురుగుల నివారణ కోసం ఎకరాకు 1500 పీపీఎం వేప నూనె లీటర్ చొప్పున లేదా అసిఫేట్ ఎకరాకు 300 గ్రాములు చొప్పున లేదా ఫ్లనికామైడ్ 50 మిల్లీలీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పత్తిలో కాయ కుళ్లు తెగులు నివారణ కోసం 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌తోపాటు 2 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. వరిలో కాండం తొలుచు, ఆకు ముడత పురుగుల నివారణకు 200 లీటర్ల నీటికి 60 మిల్లీలీటర్ల క్లోరాంట్రనిలిప్రోలు కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్, ఏఈఓ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు అందిస్తున్న విజయభాస్కర్

‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

● బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట అమ్ముతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు భానోతు బాలాజీ, జర్పుల బాలు మండల ఉపాధ్యక్షుడు కందాల చంద్రమౌళి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు దామరప్పుల శేఖర్ అధ్యక్షతన బీజేపీలో గురువారం చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ హయాంలోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కేసరి సాంబరాజు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, నాయకులు మరాఠి ఉప్పలయ్య, మెరుగు యాకయ్య, మేరుగు నరేశ్, పడిదం హరికృష్ణ, లావుడ్య సుమన్, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

బీఆర్ఎస్ జెండా ఎగరేయాలి

● మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చెన్నారావుపేట మండలంలో బీఆర్ఎస్ జెండా ఎగరేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న చెప్పారు. చెన్నారావుపేట మండలంలోని లింగగిరిలో గురువారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలిచేలా పని చేయాలని చెప్పారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెడబోయిన కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గట్టు విష్ణు, ప్రధాన కార్యదర్శి అనుముల అశోక్, ఉపాధ్యక్షుడుగా రాకం వేణు, అధికార ప్రతినిధిగా పరకాల రాజన్న, కార్యదర్శిగా జంగలి శ్రీకాంత్, ప్రచార కార్యదర్శిగా కనుకుల అనిల్, సహాయ కార్యదర్శిగా సప్పిడి శ్యామ్, కోశాధికారిగా నాంపల్లి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా మాదరపు నర్సన్న, గట్టు శ్రీను, కనుకుల శ్రీను, దాసరి అశోక్, వన్నెల సతీశ్, కాగితోజు వీరన్న, యూత్ అధ్యక్షుడిగా ఎడంపాక నవీన్ (చక్రి)లను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నిక పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్క అశోక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండవీటి ప్రదీప్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ జున్నూతుల మహేందర్‌రెడ్డి, విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి మాదారపు శ్రీనివాస్, నాయకులు ములుకల సాంబయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి మురళీ నాయక్, యూత్ కార్యదర్శి రామ్‌పటేల్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటించాలి

● ప్రజ్వల్ సంస్థ ప్రతినిధి హిమవర్షిణి

పర్వతగిరి : గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజ్వల్ సంస్థ ప్రతినిధి హిమవర్షిణి సూచించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు కుటుంబాలకు చెందిన వ్యవసాయ కూలీలు పురుగు మందుల పిచికారీ సందర్భంగా చాలా జాగ్రత్తగా ఉండేలా అంగన్‌వాడీ టీచర్లు చైతన్యవంతం చేయాలని సూచించారు. పురుగు మందుల పిచికారీ సమయంలో రైతులు రక్షణ కిట్లు (పీపీఈ) కళ్లద్దాలు, మాస్క్, ఆప్రాన్, షూ, గ్లౌజ్ ధరించాలని చెప్పారు. పురుగుల మందు పిచికారీ సమయంలో గర్భిణులు, బాలింతలు ఆ వైపు వెళ్లొద్దన్నారు. పురుగు మందుల ప్రభావం గర్భంలో ఉన్న శిశువుపై పడే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే 14 ఏళ్లలోపు వయస్కులైన పిల్లలు పనులకు వెళ్లొద్దని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మూడ్ వెంకన్న, సైకిలాబ్ బాబు, భద్రునాయక్, యాకయ్య, వేణు, అనిల్, సతీశ్, కోమల, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు చిరబోయిన రాజు విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా ఆయన మృతదేహానికి ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి పరామర్శించారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు పోలుదాసరి రాము, గొరబోయిన ముకేశ్, తెప్ప రమేశ్ పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడికి..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలో సీపీఎం నాయకుడు బైరెడ్డి సమ్మిరెడ్డికి రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు, రాష్ట్ర నాయకుడు పుచ్చకాయల చంద్రారెడ్డి నివాళులర్పించారు. గ్రామంలో గురువారం సమ్మిరెడ్డి సంస్మరణ సభ నిర్వహించగా జైపాల్‌రెడ్డి, బాబు, చంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు తోకల నర్సింహారెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, భూపాల్‌రెడ్డి, కంచరకుంట్ల నర్సింహారెడ్డి, సీపీఎం నాయకులు కుమారస్వామి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అండ్ర నర్సింహారెడ్డి పాల్గొన్నారు.